క్లుప్తంగా

కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీగా ధనలక్ష్మి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీగా ధనలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలను అందజేస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో నిరుపేద కుటుంబానికి చెందిన సీహెచ్ వరలక్ష్మికి హోప్ ఆఫ్ హంగర్ సంస్థ అందజేసిన నెలకు సరిపడా నిత్యావసరాలను ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగ వరలక్ష్మీ కుమారుడు దైవ ప్రసాద్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని అతని చికిత్స నిమిత్తం తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వాసుదేవరావు, కృష్ణం నాయుడు, ఐలయ్య గౌడ్, రవికిరణ్, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు మాధవాచారి, జనరల్ సెక్రటరీ ఫిరోజ్ అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబిహా బేగం విచ్చేసి నూతన అధ్యక్ష, సెక్రటరీ, అసోసియేషన్ సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకుల లింగాల ఐలయ్య, మాధవాచారి, లింగం, రవీందర్, గఫూర్, శ్యామ్ సుందర్‌రెడ్డి, రాజయ్య, ఎండీ ఫిరోజ్, నిజాం, ఎ. అనిల్, టి. అనిల్, అలెక్స్, లోహిత్ అక్షన్, ఒమేర్, అహ్మద్, బాబుమియా పాల్గొన్నారు.

11 మందికి కరోనా నెగటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 11 మందికి అనుమానితులకు సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో పరీక్షలు చేయగా అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చాయని వైద్యాధికారులు తెలిపారు.

30 నుంచి అమృతాలయ అష్టమ వార్షికోత్సవాలు

జగద్గిరిగుట్ట: చింతల్ గణేష్ నగర్‌లోని అమృతాలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 01వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఆలయంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, శ్రీ మహాలక్ష్మీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, శ్రీఅభయాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది.

ప్రమాణ స్వీకారం

జగద్గిరిగుట్ట: షిరిడీ హిల్స్‌లో శ్రీసాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన అధ్యక్షుడు సీహెచ్ దాసు, జనరల సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ శేషు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి గెలిపించిన బస్తీ వాసులకు రుణపడి ఉంటామన్నారు. స్థానికంగా ఏ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రప్ప, రాంబాబు, వీరారెడ్డి, మహేష్, విమలాదేవి, సంధ్యాసాగర్, రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం డివిజన్ మహిళా నాయకురాలు యాదమ్మ ఆధ్వర్యంలో మణెమ్మ, లక్ష్మి మిత్ర బృందం సభ్యులు ఆదివారం షాపూర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై చేపడుతున్న పోరాటాలపై ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్, జేమ్స్, సంజీవరెడ్డి, పండరిరావు, నారాయణ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అన్నపూర్ణ, సువర్ణ, లక్ష్మి, కౌసల్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. శైలజప్రసాద్ శిష్యబృందం గణపతి కౌతం, కృష్ణజనన శబ్దం, రామాయణ శబ్దం, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు లాస్య, సిరిమా, స్మృతి, గీత, శాన్వి, దీత్య తదితరులు అద్భుతంగా ప్రదర్శించారు.

పైన పటారం... లోన లొటారం


మోతీనగర్‌లోని వార్డు కార్యాలయం, మీసేవా ఉన్న భవనం

- మోతీనగర్ వార్డు కార్యాలయం
- మందుబాబులకు అడ్డాగా మీసేవా పరిసరాలు



వార్డు కార్యాలయంలో అస్తవ్యస్తంగా ఉన్న పరిసరాలు, చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు, అపరిశుభ్ర వాతావరణం




మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ వార్డు కార్యాలయం, మీసేవా కేంద్రాలకు రోజురోజుకు భద్రత కరువవుతోంది. రాత్రయిందంటే మందు బాబుల ఆగడాలు, అసాంఘీక కార్యక్రమాలకు నెలవుగా మారుతోంది. కార్యాలయం చుట్టూ ఎక్కడ చూసినా మందు సీసాలు, మలమూత్ర విసర్జనలతో దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. మోతీనగర్ డివిజన్‌లో మొట్టమొదటి మీసేవ కేంద్రంగా పేరు గడించిన ఈ కార్యాలయం పై అంతస్తులో మున్సిపల్ వార్డు కార్యాలయం సైతం ఉంది. నిత్యం వివిధ పనులపై వివిధ బిల్లులు చెల్లించడానికి వార్డు కార్యాలయానికి, మీ సేవకు వస్తుంటారు. గేటు ముందు అడ్డంగా కూర్చొని ఇక్కడ ఎందుకు కూర్చొన్నారని ప్రశ్నిస్తే వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు. ముఖ్యంగా మహిళలు రావడానికి జంకుతున్నారు. మీసేవ కేంద్రానికి కాపలాదారుడు, ఆవరణ లోపల విద్యుత్ లైట్లు వేయకపోవటంతో ఇలాంటివి కొనసాగుతున్నాయి.

అన్ని హంగులతో పోస్టాఫీసు....

మోతీనగర్ మీ సేవా కేంద్రం పక్కనే పోస్టాఫీస్ ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయం చుట్టూ ఫెన్సింగ్, లైట్లు ఉన్నాయి. అంతేకాకుండా సిబ్బంది విధులు పూర్తి చేసుకుని వెళ్లగానే నైట్ వాచ్‌మేన్ సైతం కాపలా ఉంటున్నాడు. అయితే మీ సేవా కేంద్రం ప్రాంతంలో చీకటి పడిందంటే సిబ్బంది ఎప్పుడు వెళతారని ఆకతాయిలు ఎదురు చూస్తుంటారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలోనే ఆకతాయిల ఆగడాలతో ఒక్కొక్క సారి బిల్లులు చెల్లించకుండానే వెనుదిరుగుతుంటారు.

◆ మీ సేవా కేంద్రం చుట్టు పక్కల అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది సైతం అక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అంతే కాకుండా మూత్రశాలలు ఉన్నప్పటికీ అవి నిరుపయోగంగా మారాయి. వాటి స్థానంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మీసేవా వార్డు కార్యాలయానికి తక్షణమే రాత్రి పూట వాచ్‌మేన్, ఆవరణలో లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరు నెలల్లో బీఆర్ఎస్ గద్దె దిగడం ఖాయం


కూకట్‌పల్లి బిర్లా ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్, పన్నాల హరీష్‌రెడ్డి, హాజరైన కార్యకర్తలు



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ బిర్లా ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ఆదివారం బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. రానున్న ఆరు నెలల్లో బీఆర్ఎస్ పార్టీ ఇంటికి పోవడం ఖాయమన్నారు. వారి పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని తెలిపారు. నేటి తెలంగాణ ప్రభుత్వానికి కబ్జాలపై ఉన్న దృష్టి అభివృద్ధి పైన లేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి కొత్త స్కీములు తెచ్చి ప్రజలను ప్రలోభ పెట్టి మళ్లీ అధికారం చేజిక్కించుకోవాలని చూస్తోందన్నారు. ప్రజలు దీనిని గమనించి జాగ్రత్తగా ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

◆ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ ప్రజలకు మరింత చేరువవుతోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి తమ అండదండలు, పూర్తి సహకారం ఉంటాయన్నారు. ముమ్ముందు మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యకర్తలు ఎప్పుడు ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ నాయకులు గోపాల్‌రావు, వేణు, బుల్లెట్ రవి, భార్గవి, విజయ్‌రెడ్డి, రేణుక, శ్యామల, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు, కో-కన్వీనర్ మణిభూషణ్, డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: మేదరి మహేంద్ర దుకాణదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు అంబదాస్ అన్నారు. ఇంద్రేశం గ్రామ సమీపంలో ఆదివారం పటాన్‌చెరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నంది కంటి నర్సింలు, అధ్యక్షుడిగా లోకేదాస్, కార్యదర్శిగా పాతకోటి భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా పోతుల మల్లేష్, కోశాధికారిగా శేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ దుకాణదారులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో మేదరి మహేంద్ర సంఘం, వెదురు బొంగుల దుకాణదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక మహంకాళి ఆలయంలో అఖండ హరి కీర్తన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తనలో ఆయన పాల్గొని పూజలు చేశారు. హరేరామ హరేకృష్ణ సంకీర్తనలతో 24 గంటలపాటు భగవంతుడి సన్నిధిలో గడపటం మంచి విషయమన్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తాను ఎప్పుడు ముందుంటానని, ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తానని తెలిపారు. అనంతరం నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కిషన్ ప్రసాద్, సంతోష్ సింగ్, ధనుష్ శర్మ, మనోజ్ కుమార్, మున్నా యాదవ్, అయోధ్య, లలన్ సింగ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు):మాదారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ రూ.1.16లక్షలను విరాళంగా అందించారు.ఆదివారం ఆయన ఈ మొత్తాన్ని ఆలయ బాధ్యులకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణం.. కమనీయం




మోతీనగర్: పూర్వకాలం రాజులు రాజ్యాల కోసం యజ్ఞ హోమాలు చేపట్టేవారని, నేడు లోక కల్యాణార్థం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నారని తపోవనం తుని పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామి పేర్కొన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీహాలులో శ్రీనివాస కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మోతీనగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవంలో రిటైర్డ్ ఐజీ గోపీనాథ్‌రెడ్డి, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చివరి బస్టాప్‌కు బస్సు సర్వీస్ షురూ



సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: కార్మికులు, కర్షకులు నివసించే ఆల్విన్‌కాలనీ ఫేజ్-2కు ఆర్టీసీ బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి ఆర్టీసీ బస్సు ఎక్కాల్సిన దుస్థితి నెలకొనేది. ఈ నెల 25న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించి శనివారం రాత్రి బస్సులను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల వైద్య చికిత్సలకు భరోసా సీఎంఆర్ఎఫ్


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన రూ.4లక్షల చెక్కులను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ సేవలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆస్పత్రి బిల్లులు కట్టుకోలేని నిరుపేదలు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులను స్ఫూర్తిగా తీసుకోవాలి


అవార్డులు అందుకున్న వారితో మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సత్యవోలు రాంబాబు


స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు అందుకుంటున్న రమణభూపతి

కూకట్‌పల్లి: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి భారత వికాస్ పరిషత్‌లో జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో సేవలందించిన 30 మంది ప్రముఖులకు స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జేడీ లక్ష్మీనారాయణ హాజరై అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... సమాజసేవలో ఉన్న సామాజికవేత్తలను వివిధ రంగాల్లో ప్రముఖులైన వ్యక్తులను సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో విద్యార్థులను సుశిక్షితులుగా తీర్చిదిద్దడంతో పాటు వారికి ప్లేస్‌మెంట్స్ చూపించడంలో క్వాలిటీ థాట్ ఫౌండర్ చైర్మన్ రమణభూపతి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. నాల్గో తరగతి చదువుతున్న మౌక్తిక వేసిన లక్ష్మీనారాయణ లైవ్ పెయింటింగ్ అందరిని ఆకట్టుకుంది.

◆ భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఆయా రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్న వారిని యువత స్ఫూర్తిగా తీసుకుంటుందన్నారు. యువత సన్మార్గంలో నడిస్తే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా సీఎల్ఎస్ గాంధీ, లయన్ ఎం.ప్రేమ్‌కుమార్, ఈవెంట్ చైర్మన్ కృష్ణాది శేషు, డాక్టర్ మార్కండేయులు, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు, డైరెక్టర్ సత్యవోలు పూజిత, నిర్వాహకులు సురేందర్, కో చైర్మన్లు లయన్ చదల్ల సత్యనారాయణ, యాదయ్యగౌడ్, విజయ్‌కుమార్, మిమిక్రీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల భేటీ


భేటీలో పాల్గొన్న మాధవరం కాంతారావు, పన్నాల హరీష్‌రెడ్డి

ఫతేనగర్: ఫతేనగర్ డివిజన్‌లో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు ఆదివారం భేటీ అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు హాజరై బూత్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. అనంతరం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, సీనియర్ నేత రాజేశ్వరరావు, పలువురు నేతలతో కలిసి పోలింగ్ బూత్ అధ్యక్షుడి పేరుతో ఉన్న ప్రత్యేక బోర్డును ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసి ఆయనకు తగు గౌరవాన్ని ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నీతు సింఘ్, తులసిరామ్, ఉదయ్‌రాం, రామ్‌మోహన్ రామ్, యాదగిరి, జోజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు


విజేతలకు బహుమతుల అందజేస్తున్న సునీత రామ్మోహన్‌రెడ్డి, కృష్ణయ్య

మూసాపేట: విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పీఎస్ఎం స్కూలులో ఆదివారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విశ్వ హిందూ పరిషత్ ప్రాంత ఉపాధ్యక్షులు సునీత రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ ప్రాంత సహ సంయోజక్ జీవన్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణయ్య, పాండేజి, జిల్లా సహ కార్యదర్శి అర్జున్, విభాగ్ సంఘటన మంత్రి రామ్, జిల్లా సంఘటన మంత్రి తిరుపతి, జిల్లా సంయోజక్ బాలాజీ, రాము, జిల్లా సహ సంయోజక్ సాయికుమార్, వినీత్, దర్మప్రసాద్, పవన్, విశ్వకర్మ, జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 99శాతం పనులు పూర్తయ్యాయి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బీఆర్ఎస్ కార్పొరేటర్లు, అధ్యక్షులతో సమీక్ష
- అభివృద్ధి పనులను ప్రజలకు తెలపాలని సూచన


కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలతో కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. అందులో ప్రధానంగా నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఏ విధంగా అభివృద్ధి చెందిందో ఇంటింటికీ తిరిగి వివరించాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 99శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా నియోజవకర్గం నుంచి కార్యకర్తలను పెరేడ్ గ్రౌండ్ వరకు తీసుకువెళ్లే బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటి వారికి ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు...

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో ఆదివారం వివేక్‌నగర్‌కు చెందిన సుమారు 50 మంది శశాంక్‌గౌడ్, అతని మిత్రులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్, వివేక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.